# పరిణయం

"కష్టాల్లో వున్న ఆడవాళ్ళంటే మొగవాళ్ళకు జాలి కలుగుతుంది మొదట. ఆ స్త్రీయేగాని అందమైనదైతే ఆ జాలిని అనురాగంగా మార్చుకుంటారు. హృదయవేదనతో క్రుంగిపోతూ, మనస్సులో మానని గాయాలున్న స్త్రీలను మగవాళ్లు ఇట్టే ప్రేమించేస్తారు. చీకటి నిండిన బ్రతుకులో వెన్నెల పంట పండించామనుకోవడం, మొగవాళ్లకిష్టం. ఆనందంతో కేరింతలాడుతూ, లోకమంతా పచ్చగా వుందనుకునే స్త్రీలు మొగవాళ్ళనాకర్షించలేరు ఏమంటావు?" స్నేహితురాలడిగింది.

"నేను ఒప్పుకోనంటాను. జీవితంలో ఏ దుఃఖమూ లేని మనుష్యులంటే ఎవరికన్నా ఆప్యాయత కలుగుతుంది. కన్నీళ్ళు కార్చేవారిని పలుకరించాలనిపించదు ఎవరికీ..." అన్నది ప్రభావతి.

"సరే చూద్దాం. అనుభవం మీద అదే తెలుస్తుంది" అన్నది స్నేహితురాలు

"అనుభవం సంపాదించి మరీ తెచ్చుకుంటాను" అన్నది పంతంగా ప్రభావతి.

❊

"కుమారి ప్రభావతీ దేవి బి.ఏ., బీహారులో వుంటారు వారి తల్లితండ్రులు. వేసవి గడపడానికి వచ్చారీవేపు. సంగీతమంటే చాలా అభిమానం. మధుసూదనరావుగారు ఎం.ఏ. విశాఖపట్నంలో వ్యాపారస్తులు. జమీందారీ కుటుంబం వీరిది. సంగీతమంటే చాలా ఇష్టం." ఈ విధంగా మధుసూదనరావుకు పరిచయం చేయబడ్డది ప్రభావతి. అతను ఏదో వ్యాపారం మీద బెంగుళూరు వచ్చాడు. ఈ మధ్యనే తల్లిని హాస్పిటల్లో చేర్పించాడు. తాను రాయల్ హొటలులో బస చేశాడు.

ఆ సాయంకాలం ఏమీ తోచక రేడియో ఎదురుగా కూర్చొని ఏదో మేగజీను పరిశీలిస్తున్న మధుసూదనరావుకి ప్రభావతీ దేవి పరిచయం చేయబడింది. పరిచయం చేసిన వ్యక్తి ఆరోజు వుదయమే మధుసూదనరావుకి పరిచయమైన భీమసేనరావు.

ప్రభావతీ దేవి చిరునవ్వుతో నమస్కారం చేసి "మిమ్మల్ని గురించి చాలా విన్నాను" అంటూ సోఫాలో కూర్చుంది. పొడుగ్గా దంతం బొమ్మల్లే వుందామె. ఆమె చేతులు నల్లని అంచు రవికకి కాంట్రాస్టుగా తెల్లగా మెరుస్తున్నాయి. ఒక చేతికి వున్న ఆరు జతల బంగారు గాజులు మృదుమధుర శబ్దం చేస్తుండగా నుదుటిమీద పడిన జుట్టుని సవరించుకుందామె. సన్నగా కళ్ళకు పెట్టిన కాటుక బహు నాజూగ్గా సోగ కన్నులకి అందం తెచ్చింది. చక్కని చుట్ట మీద అర్ధచంద్రాకారంగా నవ్వుతున్నాయి మల్లెపూలు. తెల్లని ఉప్పాడ జరీ అంచు చీరె

పాము కుబుసంగా ఆమె వంటికి ఇమిడింది. మల్లె మొగ్గల్లాంటి పలువరుస కనుపించేలా నవ్వుతున్నాయి ఆమె పెదవులు.

ఒక్క క్షణం ముగ్ధుడై చూశాడు మధుసూదనరావు. "ఆహా అల్లాగాండీ? నన్ను గురించి ఏముందండీ వినేందుకు? భీమసేనరావుగారు అనవసరంగా పొగిడేసి వుంటారు నన్ను."

"ఆ పొగడ్తలన్నీ వృధా కాదని కొద్ది సేపటిలో తెలుస్తుందని ఆశిస్తున్నాను."

మధుసూదనరావుకి కర్ణాటక సంగీతమన్నా, హిందుస్థానీ శాస్త్రీయ సంగీతమన్నా చాలా అభిమానం. ఇద్దరికీ అభిరుచి వున్న ఈ విషయాన్ని గురించి చాలా సేపు ముచ్చటించారు. మరి కొద్దిసేపటిలో ప్రభావతికి హిందూస్థానీ సంగీతంలో అభిరుచే కాక ప్రవేశం, పాండిత్యం కూడా వున్నాయని తెలుసుకున్నాడు మధుసూదనరావు. సాయంకాలం ఏడు గంటలకు హాస్పిటల్‌లోని తల్లిని చూడటానికి వెళ్ళవలసి వుంది. అంచేత అప్పటికి ప్రభావతి వద్ద సెలవు తీసుకున్నాడతను.

మరునాడుదయం ఎక్స్‌ప్రెస్‌లో భీమసేనరావు వెళ్ళిపోయాడు. మధుసూదనరావు, ప్రభావతి పరిచయస్తులుగా మిగిలారు. ఆ సాయంకాలం తోటలో కనుపించింది ప్రభావతి.

"నమస్కారమండీ! భీమసేనరావుగారు వెళ్ళిపోయారు. మీరప్పటికి మీ గది నుండి బైటకి రాలేదు. తన శుభాకాంక్షలు తెలుపవలసినదిగా చెప్పారాయన" అని మధుసూదనరావుకు ప్రభావతి చిరునవ్వుతో నమస్కరించింది.

"మీ అమ్మగారు కులాసాగా వున్నారా?" అని పలుకరించింది.

"కులాసాగానే వుంది. బాగానే కోలుకుంటోంది ఈ వాతావరణంలో."

దగ్గర్లోనే వున్న సిమెంటు బెంచి మీద కూర్చున్నారు వారు. సినిమా సంగీతంలో శాస్త్రం, మాధుర్యం కూడా లోపించాయని మధుసూదనరావు అన్నాడు. మాధుర్యం లోపించలేదని శాస్త్ర సమ్మతం కాకపోయినా అది ప్రజారంజకమే కాబట్టి సహించవచ్చునని అన్నది ప్రభావతి. మాటల సందర్భంలో తనకు కర్ణాటక సంగీతంలో ప్రవేశం వుందని తెలిపింది ప్రభావతి. మధుసూదనరావు కూడా దాచుకోలేక తనకు వాయులీనం అభ్యాసముందని తెలియపర్చాడు. ప్రభావతి తెలుగు అంత చక్కగా మాట్లాడుతున్నందుకు అతడాశ్చర్య పోయాడు.

"మా నాన్న మీ వేపు వారేనండి. మా అమ్మ మాత్రం పంజాబీ. నాన్నగారు నాకు చిన్నప్పటినుంచి తెలుగు నేర్పారు. నేను ప్రైవేటుగా తెలుగులోనే బి.ఏ. వరకు చదివాను. నేను దేశాలు చూడటం మంచిదని నాన్న అంటారు. అందుకనే ఈ వేసవి బెంగుళూరులో గడిపి రమ్మని నాన్నగారి ఆదేశం. తన పిల్లలు దేశాలు తిరగడం మంచిదికాదని అమ్మ అంటుంది."

"మీ అమ్మగారన్నట్లు ఆడవాళ్లు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితులు లేవండి మన దేశంలో. రక్షణ అవసరమే. పరాయి దేశాల్లో మీరింకా ఎన్నాళ్ళుందామను కుంటున్నారు? మీ కెవరూ బంధువుల్లేరా ఈ ప్రాంతంలో" అనడిగాడు మధుసూదనరావు.

"ఉన్నారండీ! బెంగుళూరులోనే మా నాన్న మేనమామ కూతురొకావిడ వుంది. వాళ్ళింటికి వెడతాననే మా అమ్మకి చెప్పాను. అందాకా అమ్మ నన్ను కదలనివ్వలేదు. కానీ ఇక్కడ దిగాను. వాళ్ళింట్లో దిగడమంటే నాకు నచ్చదండి. కాస్త సొసైటీ చూద్దామని, ఇతర దేశస్థులతో పరిచయం కలుగజేసుకోవాలని నా అభిలాష. మీలాంటి వారితో పరిచయం కలిగిందంటే నా జీవితంలో అనుభవజ్ఞానం ఆర్జించుకుంటున్నానన్న మాట ఇంత వరకు వచ్చినా ఇంకొకరికి రక్షణ ఏమిటండీ? మా అమ్మ అంతా పూర్వకాలం మనిషి" అన్నది ప్రభావతి.

చీకటి పడుతుండడం వల్ల ప్రభావతి లోనికి వెళ్ళింది. చాలాసేపు నక్షత్రాల కాంతిని చూస్తూ అలాగే కూర్చున్నాడు మధుసూదనరావు. ప్రభావతి లాంటి సౌందర్యవతి, దూరదేశానికి చెందిన స్త్రీ ఇల్లా వుండడం అతనికి ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆమె వివాహిత ఔనో కాదో, ఆమె తల్లిదండ్రులు ఇల్లా ఎందుకు పంపారో, ఆమె హోటల్లో వుండి ఏమి చేస్తుందో ఏమీ అంతు చిక్కటం లేదు అతనికి. శ్రీమంతురాలుగా ఆమె వేషం గోచరిస్తోంది. ఇంత ఖరీదైన హోటల్లో కులీనురాలైన స్త్రీ ఒంటరిగా వుండడంలోని ఆంతర్యం బోధపడలేదు మధుసూదనరావుకు. ఎంతసేపో ఆలోచన్లో మునిగి, చివరికి నిట్టూర్చి లేచాడతను.

నాలుగైదు రోజులు గడిచాయి. ఎంత కుతూహలమున్నా ప్రభావతిని గురించి అంతకంటే ప్రశ్నించడం సభ్యత కాదనుకున్నాడు మధుసూదనరావు. తండ్రి చాలా చదువుకున్నవాడనీ, ఆయనకు తనన్నా, తన తమ్ముడన్నా చాలా ప్రేమ అనీ చెప్పిందామె. తన చిన్ననాటి కబుర్లు, బీహారులోని తన జీవితం అన్నీ విచిత్రంగా వర్ణించి చెప్తుతుండేది ప్రభావతి.

మధుసూదనరావు పల్చగా, పొడుగ్గా వుంటాడు. అతని ముఖంలో మార్దవం, అతని కళ్ళల్లో కాంతి కనిపిస్తుంటాయి. చాలా పరిశుభ్రంగా కడిగిన ముత్యమల్లే వుంటాడతను. పల్చని పెదవులు తమాషాగా వంపులు తిరిగేలా నవ్వుతుంటాడు అప్పుడప్పుడు. అతని శరీర కాంతికి వన్నెనిచ్చే సిల్కు లాల్చీలే ధరిస్తాడతను. తెలుగులో యం.ఏ. ప్యాస్ అయినా తండ్రి చేసే మాంగనీసు వ్యాపారాన్ని మానలేదు. ఎక్కువ లాభాలు రాకపోయినా నష్టం లేకుండా నడుపుకొస్తున్నాడు. వ్యాపారాన్ని విశాఖపట్నంలోని నమ్మకమైన తన మేనేజరుకు సమస్తం అప్పగించి వూళ్ళవెంబడి తిరుగుతుంటాడతను. చీకూ చింతా లేనట్లుండే అతన్ని చూస్తే ఎవరికన్నా అతనితో సంభాషించాలనిపిస్తుంది.

ఈ కొద్దికాలంలోనూ కొన్ని గంటలసేపు సంభాషించడం అలవాటైంది వీరిద్దరికీ. ఉదయం వేళ చెట్ల నీడల్లో కూర్చుని ఏదో చర్చించుకునేవారిద్దరూ. మధ్యాహ్నం వేళ రేడియో సన్నగా పాడుతుండగా పేకాడేవారు. సాయంకాలం కాస్సేపు రేడియో విని కాస్సేపు తోటలో కొలను దగ్గర పచార్లు చేసేవారు. ఇద్దరికీ అర్థం కాని చిత్ర కళను కూడా చర్చించేవారు.

ఒకనాడు వుదయం ప్రభావతి తన గదిలోంచి బైటకు రాలేదు. మధుసూదనరావు కొంచెం ఆశ్చర్యపోయినా పైకి ప్రకటించకుండా వూరుకున్నాడు. ఆ సాయంకాలం కూడా కనుపించలేదు ప్రభావతి. ఆ రాత్రి కలతగా అనిపించింది మధుసూదనరావుకి.

❋

మధుసూదనరావు వెయిటర్ నడిగి, ఆమె గదిలోనే వున్నదనీ, ముందు నాడు భోజనం చేయలేదనీ తెలుసుకున్నాడతను.

కాఫీ త్రాగగానే ఆమె గదికి మొదటిసారిగా వెళ్లాడు మధుసూదనరావు. ఆమె సోఫాలో దిండు వేసుకుని పడుకునుంది. కళ్లు మూసుకుని నుదుటిమీద చెయ్యి పెట్టుకుని పడుకున్నా ఆమె ఒక దివ్యమూర్తిగా గోచరించింది మధుసూదనరావుకి. కొద్దిగా నలిగిన నల్ల పట్టుచీర కట్టుకునుంది. చేతులకి తేనెరంగు గాజులున్నాయి. సోఫాలో ఎవరో కూర్చున్నట్లు అలికిడై ఆమె ఉలిక్కిపడి లేచింది. చిందరవందరగా వున్న జుట్టు ముడివేసుకుని పమిటనిండుగా కప్పుకుంది.

ఆమె కళ్లు నిద్రలేమితో ఎర్రబడినట్లున్నాయి. చాలా నీరసంగా వాలిపోతోంది ఆమె శరీరం. సోఫాలో కూలబడి ఒక్క క్షణం కళ్లు మూసుకుందామె.

“క్షమించండి. కొంచెం కళ్లు తిరిగినట్లయింది” అన్నదామె.

మధుసూదనరావుకి ఏం మాట్లాడాలో తోచటం లేదు. “మీరు నిన్న కనిపించలేదు. ఆరోగ్యం బాగుండలేదేమోనని చూద్దామని వచ్చాను. క్షమించండి, మిమ్మల్నేమైనా ఇబ్బందిపరచినట్లయితే.”

ఆమె చేతులు కళ్లమీద నుంచి తీసి వెనక్కి వాలి కూర్చుంది. "నాకేం? నేను బాగానే వున్నాను" అన్నది. ఇంతలోనే ఆమె ముఖం చేతుల్లో దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

మధుసూదనరావుకి ఏమీ అర్థం కావటం లేదు. "చూడండి! మీరిల్లా ఏడవకండి. మీ ఇంటి నుంచి ఏమన్నా దుర్వార్త వచ్చిందా" అనడిగాడు. కొద్ది నిమిషాల తర్వాత ఆమె ఏడవడం మానేసింది.

"ఏం లేదండీ. అంతా కులాసాయే... ఇంట్లో అంతా కులాసాయే. ఏమిటో మనస్సు బాగుండక... క్షమించండి" అంటూ ఆమె లోనికి వెళ్ళి ముఖం శుభ్రంగా కడుక్కుని, కుంకుమ పెట్టుకుని ఒక్క నిమిషంలో వచ్చింది. ఎర్రగా, అందంగా మెరుస్తున్నాయి ఆమె కళ్లు. ఆర్ద్రంగా వున్న ఆమె కనురెప్పలు బరువుగా వాలుతూ ఆమె ముఖానికి వింత సోయగాన్నిస్తున్నాయి.

"మీరేదో బాధపడుతున్నట్లున్నారు. మీకీ దేశంలో ఎవరూ లేరు. ఎవరికీ ఏమీ చెప్పకుండా ఇల్లా బాధపడితే ఆరోగ్యం చెడిపోతుంది. మనస్సులోని వేదన మరింత ఎక్కువవుతుందే కాని తగ్గదు. ఎవరితోనన్నా చెబితే భారం తీరుతుంది. కాఫీ తీసుకుందురుగాని. పంపుతాను" అంటూ లేవబోయాడతను. ప్రభావతి అతన్ని వారించింది.

"వద్దు నా కాఫీకేం తొందర్లేండి."

"అల్లా కాదు. మీరు భోజనం మానేస్తే ఆరోగ్యం పాడవుతుంది. ఈ పరాయి దేశంలో మీరు పాట్లు పడడం సబబు కాదు. మీ ఇంటి దగ్గర్నించి ఏమన్నా కబురొచ్చిందా? ఏమైందో నాకు చెప్పండి. కొంత బరువు తీరుతుంది. ఏదో తీరని వేదనతో బాధపడుతున్నట్లున్నారు మీరు?" అన్నాడు మధుసూదన రావు. జాలిగా నవ్విందామె. "ఎందుకండీ! నా బాధలు ఒకరికి చెప్పి, వారి సుఖజీవితాన్ని కూడా కలుషితం చేయడం? వద్దండి. మీరీ మాత్రం సానుభూతి చూపుతున్నారు అదే చాలు. ఎంతో కృతజ్ఞురాలిని" అన్నదామె.

మధుసూదనరావు ఈ మాటలకు నొచ్చుకున్నట్లు కనబడ్డాడు. "మీ ఆవేదన వ్యక్తి గతమైనది ఇంకొకరికి తెలుపరానిదైతే నేనడిగినందుకు క్షమించండి. ఈ కొద్ది పరిచయంతోనూ బాగా సన్నిహితులయ్యారు కాబట్టి అడిగాను మన్నించండి."

ప్రభావతి వెంటనే లొంగిపోయింది.

"అబ్బే అది కాదు. చూడండి. మీరు నాకు ఆప్తులనుకుని నా గాథను మీకు చెప్పుకుంటున్నాను. మీ ఆనందాన్ని పాడు చేస్తున్నందుకు క్షమించండి. పదండి అల్లా తోటలోకి వెడదాం. ఇక్కడ నాకు వుక్క పోస్తోంది" అంటూ లేచిందామె.

"ఒక్క నిమిషం" అంటూ లోపలికి వెళ్ళింది. తల దువ్వుకుని, వాలుజడ వేసుకుని సన్నగా కాటుక పెట్టుకుని వచ్చిందామె. చీరె కొంచెం తీరుగా సర్దుకుంది. నల్లని జరీ చెప్పులు ఆమె పచ్చని పాదాల మీద మెరుస్తూ, జీరాడే ఆమె చీరె జరీ అంచుతో కలిసిపోతున్నాయి. మధ్య మధ్య మొగలి రేకుల్లా కనుపిస్తున్నాయి ఆమె పాదాలు.

తోటలో తమకు బాగా పరిచయమున్న ఒక చెట్టు క్రింద కూర్చున్నారు వారు. ఉదయభానుని లేత కిరణాలు చెట్ల మీదికి మెల్లిగా ప్రాకుతున్నాయి. ప్రకృతి అంతా ఒక సువర్ణ కాంతిలో వుంది.

కూర్చోగానే మధుసూదనరావు వంక సూటిగా చూస్తూ అడిగింది ప్రభావతి.

"మీకు వివాహమైందా?" చకితుడైనా వెంటనే తేరుకున్నాడు.

"లేదు."

ప్రభావతి కాస్సేపు నిశ్శబ్దంగా వూరుకుంది.

"మీరంతగా మనస్సుకి పట్టించుకుంటున్నారు కాబట్టి సంకోచం విడిచి చెప్తున్నాను. మన పరిచయం చాలా స్వల్పకాలానిదైనా మీరన్నట్లు ఈ పరాయి దేశంలో ఆప్తబంధువులైనారు మీరు. నిజానికి వ్యక్తిగత విషయమే అనుకోండి. హఠాత్తుగా ఇంత విపత్తు సంభవించి, నా జీవితమంతా ఇల్లా మారిపోతుందని నేను కలలో కూడా అనుకోలేదు... " ఆమె సుందర వదనం మీద విషాదచ్ఛాయలు క్రమ్ముకున్నాయి.

"మీ తల్లిదండ్రులు దూర దేశంలో వున్నారు. అసలీ సంఘటనలేమిటో వారికి తెలుసా?" అనడిగాడు మధుసూదనరావు.

"తెలుసు. మా నాన్నగారే వ్రాశారు. నన్ను వెంటనే రమ్మని వ్రాశారు. నాన్నగారు బొత్తిగా లేవలేని స్థితిలో వున్నారట. వచ్చి తీసుకుపోదామంటే" ఆమె తలవంచుకుని కొన్ని నిమిషాలు మౌనంగా కూర్చుంది. కొద్ది సేపటికి ఆమె తల ఎత్తింది.

అప్పుడే సూర్యుడు పైపైకి వస్తున్నాడు. ఎదురుగా కొలనులోని తామరపువ్వులు వికసించి, గాలికి ఆనందంగా వూగుతున్నాయి.

"చెప్పండి. సంకోచించకండి. ఇది మీ... అంటే ఏమన్నా ప్రణయగాథని అనుకోవచ్చునా?" అనడిగాడు మధుసూదనరావు. విచారంగా నవ్వింది ప్రభావతి. "ఔను. అది నా ప్రణయగాథే విషాదమైపోయిన గాథే!"

"నేను బీహారులోనే పెరిగానని మీకు చెప్పాను కదూ? మా నాన్న జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తుండేవారు. నేను ఇంటర్ చదువుతున్నానప్పుడు. ఒకనాడు నాన్నగారు ఆఫీసునుంచి కారు మీద ఇంటికి వస్తుంటే ఒక ప్రమాదం సంభవించింది. ఒక యువకుడు మా నాన్నగారి కారు క్రింద ప్రమాదవశాత్తు పడ్డాడు. చాలా తీవ్రంగా గాయాలు తగిలాయి. సరాసరి ఇంటికే తీసుకు వచ్చి సర్జనుని పిలిపించి చికిత్స చేయించారు నాన్న. నెల రోజులకు పైగా మా ఇంట్లో వున్నాడతను. అతను మా ఇంట్లో వుండడం, నేను ప్రైవేటుగా చదవటం వల్ల ఇంట్లోనే వుండడం సంభవించింది. అతనికి అప్పుడప్పుడు నేనే సదుపాయాలన్నీ చేయవలసివచ్చేది." ప్రభావతి కొంచెం ఆగి, జాలిగా నవ్వింది. ఆమె చెక్కిళ్ళ మీద అరుణ రేఖలు కనుపించాయి.

"ఏమిటది? అంతా సహజమేకదూ? అతనప్పటికే బి.ఇ. పూర్తి చేసి వూరికెనే వున్నాడు. కాశ్మీరు దేశస్థుడు. చంద్రకాంత్‌కి తల్లిదండ్రులు లేరు. చిన్నప్పటినుంచి ఆలనా పాలనా ఎరుగని వాడతడు. మా అమ్మ, నాన్న ఆదరణ చూసేసరికి అతనెంతో పొంగిపోయాడు. అతడు అనాధ బాలుడనే వుద్దేశ్యంతో మా వాళ్ళు రానిచ్చారు. మధ్య మధ్య బీహార్ వచ్చినప్పుడల్లా ఒకొక్క నెల మా అతిధిగా వుండేవాడతను. క్రమంగా పెరిగిపోయింది మా బాంధవ్యం. నేను బి.ఏ. పూర్తి చేశాను. ఇదంతా నాలుగు సంవత్సరాల క్రిందటి మాట. మధుసూదనరావుగారూ! మా ప్రణయం మా నాన్నగారికి కూడా తెలిసింది. ఆయన ఆమోదించలేదు. నేనెంతో గోల చేసిన తర్వాత వప్పుకున్నారాయన. మా అమ్మ ససేమిరా వల్లకాదంది. ఒక దిక్కులేని వాణ్ణి చేసుకోవడం ఆమె సహించనంది. కాని మేము వివాహం చేసుకోడానికే నిర్ణయించాము. క్రిందటి సంవత్సరం విమాన సర్వీస్‌లో జాయిన్ అయినాడతను. ఈ ఏడు డిసెంబర్ తర్వాత తనకు ప్రమోషన్ వస్తుందనీ, అప్పుడు వివాహం జరగాలనీ వ్రాశాడతను. ఇన్ని సంవత్సరాలు నిల్చి వుంది మా ప్రణయం. నన్ను పూవుల్లో పెట్టి పూజిస్తాడతను. మా అమ్మ ఆమోదించలేదని అతను చాలా బాధపడుతున్నాడు. ఈ వేసవిలో నన్ను బెంగుళూరు వెళ్ళకుండా తనతో పాటు కాశ్మీరుకు రమ్మన్నాడతను. కాని, నాన్నకి మేమిద్దరం వివాహానికి మునుపే ఇంత సన్నిహితంగా వుండడం ఇష్టం లేదు. అందుకని నన్నూ, అతడినీ వప్పించి ఈ వేపు పంపించారు నన్ను. అతను సెలవు తీసుకోకుండా పని చేస్తున్నాడు. రోజు విడిచి రోజు వుత్తరాలు వ్రాసుకుంటున్నాము. ఇంతలో ... " ప్రభావతి కంఠం రుద్ధమైంది. ఆమె కళ్ళు నీళ్ళతో నిండాయి. ఆమె క్రింది పెదవి వణుకుతోంది.

"ఏం చెప్పను మధుసూదనరావుగారూ!" అంటూ ఆపుకోలేక బావురుమని ఏడ్చిందామె.

మధుసూదనరావుకి ఆమెను ఎల్లా ఓదార్చాలో తోచలేదు. "ఊరుకోండి. అతనికేమైనా ప్రమాదం సంభవించిందా?"

కొద్ది సేపటికి ఆమె కళ్ళు తుడుచుకుంది. "పెద్ద ప్రమాదమే సంభవించింది. బొంబాయి వెడుతుండగా విమానం కూలిపోయింది. "చంద్రకాంత్...నా చంద్రకాంతే నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయాడు" ప్రభావతి హృదయ విదారకంగా ఏడుస్తోంది. మధుసూదనరావుకి ఏమి మాట్లాడాలో తోచటం లేదు.

"ఊరుకోండి ప్రభావతీ దేవీ! నాకనుభవం లేకపోయినా అర్థం చేసుకోగలను. మీ మనస్సులో ఎంత తీరని బాధ ఏర్పడిందో. మీరింకా చిన్నవారు. ఇల్లా మీ జీవితమంతా విచారంగా గడిపితే వృద్ధాప్యంలో వున్న మీ తల్లిదండ్రులు ఎంతగా శోకిస్తారో యోచించుకోండి. మర్చిపోవాలి మరి. కాలక్రమాన మీరీ చీకటి దాటి వెలుగులోకి వెళ్ళగలుగుతారు."

సుమారొక అరగంట సేపు ప్రభావతి నిశ్శబ్దంగా ఏడుస్తూ కూర్చుంది. ఎండ బాగా ఎక్కువైంది.

"పదండి, లోపలికి వెడదాం. భోజనం చేద్దాం. మీకభ్యంతరం లేకపోతే ఇద్దరం కలిసి మీ గదిలోనే భోంచేద్దాం."

కృతజ్ఞతా సూచకంగా నవ్వింది ప్రభావతి. ఆమె తల వూపింది.

మూడు రోజులు గడిచాయి. ప్రభావతి మధ్య మధ్య ఏదో జ్ఞాపకం వచ్చినట్లుగా ఉలిక్కిపడి ఏడుస్తుండేది. కాని ఇదివరకంత హృదయవిదారకంగా లేదామె పరిస్థితి.

ఒక రోజు వుదయం చంద్రకాంత్‌ని గురించి ఎంతసేపో కబుర్లు చెప్పింది ప్రభావతి. చాలాసేపు ఆలోచించి చివరికి తన దండలోని లాకెట్‌ని తీసి మధుసూదనరావుకి చూపించిందామె. ఆ లాకెట్‌లో చిన్న ఫోటో వుంది. అది చంద్రకాంత్‌దని చెప్పిందామె. చాలా అందంగా వున్నాడతను. మధుసూదనరావు చాలాసేపు పరీక్షగా చూశాడు ఆచిన్న ఫోటోని. ఆ ఫోటో ఎన్‌లార్జిమెంట్ తన దగ్గరుందనీ, కొద్దికాలం కిందటే ఈ చిన్న ఫోటోని ఎన్‌లార్జి చేయించానని చెప్పిందామె. ఇది మినహా అతని జ్ఞాపకచిహ్నాలేమీ లేవన్నది.

మధుసూదనరావు తల్లి పూర్తిగా ఆరోగ్యవంతురాలైంది. ఆమెను హాస్పిటల్లో నుంచి మరొక వారంలో తీసుకు వచ్చి, మధుసూదనరావు విశాఖపట్నం వెళ్లిపోవలసి వుంది. ఒకనాటి వుదయమే ఆమెకీ విషయం తెలిసి, ఆమె కూడా బీహారు వెళ్ళిపోతే బాగుంటుందన్నాడు మధుసూదనరావు.

ప్రభావతి మాట్లాడలేదు. నేల మీద వున్న గడ్డిని పీకి కొలనులోకి పారేస్తోంది. ఆమె జుట్టు సూర్యకాంతికి మెరుస్తోంది. కళ్ళు వాల్చి ఏమీ పలక్కుండా కూర్చుందామె.

"ఏమంటారు ప్రభావతీ? మీకిక్కడ పరిచయస్థులెవరూ లేరు. ఇంటికి వెళ్ళి మీ అమ్మగారిని, నాన్నగారినీ చూస్తే కాస్త ఉపశమనం కలుగుతుంది. ఆప్తులెవరూ లేక మరీ కష్టం కాదండీ? అదీ కాక మీ వాళ్ళు ఉత్తరాలు వ్రాశారంటున్నారు?"

ప్రభావతి మాట్లాడలేదు. ఆమె రెప్పలు ఒక్కసారి మూసేసరికి జలజలరాలాయి కన్నీళ్ళు. మధుసూదనరావు తడబడ్డాడు.

"ఏమిటి ప్రభావతీ? ఎందుకు, ఏమైంది?" అని ఆతృత ధ్వనించేలా అడిగాడు. కానీ అతని కళ్ళల్లో చిలిపితనం కనిపిస్తోంది. పరిహాసంగా నవ్వుతున్న కళ్ళను చూసింది ప్రభావతి తలెత్తి.

"మీకంత పరిహాసంగా ఏమి కనిపిస్తోందో నా కర్థం కావడం లేదు. మీ మానాన మీరు వెళ్ళవచ్చు.

నా విషయం పట్టించుకోనక్కరలేదు". హఠాత్తుగా ఆమె మాటల్లోవచ్చిన కాఠిన్యం అర్థం కాలేదు మధుసూదనరావుకు.

"క్షమించండి ప్రభావతీ! మిమ్మల్ని బాధించినట్లయితే!" ఎంతసేపో మౌనంగా కూర్చున్నారు వారు.

"ప్రభావతీ!" అని మెల్లిగా పిల్చాడు మధుసూదనరావు. ఆమె తల ఎత్తి చూచింది.

"చూడు నువ్విల్లా ఎన్నాళ్ళుంటావు వివాహం చేసుకోకుండా. జీవితమంతా ఒంటరిగా నడవడం చాలా కష్టం సుమా?" అని అన్నాడు మృదువుగా అతను.

"చూడు" చిన్నగా దగ్గాడతను.

"నన్ను గురించి నీకేమైనా తెలుసా?"

ఆమె మాట్లాడలేదు.

"నీ హృదయంలో ఎంత తీవ్రమైన గాయముందో నేనెరుగుదును. నీ భగ్న ప్రేమని హేళన చేయటం లేదు నేను. నీ హృదయంలో చిన్న జ్యోతి వెలిగిద్దామని, నీ జీవితంలో ఏ కొద్దిగానో సౌఖ్యం కల్పింప చేద్దామనీ నా ఆశ. నిన్నవమానించే వుద్దేశం లేదు నాకు. నేను డబ్బున్న వాడిని. నిన్ను సుఖపెడతాను. నాకు తల్లి మినహా ఇంకెవ్వరూ లేరు. ఆవిడ నీలాంటి లక్ష్మీదేవిని చూస్తే వుబ్బిపోతుంది. నిన్ను చూచిన క్షణాన్నుంచీ నాలో ఏదో విచిత్రావేశం కలుగుతూ వచ్చింది. నిన్నీ పరిస్థితిలో చూస్తుంటే నా అనురాగం ద్విగుణీకృతమైంది. నువ్వు చంద్రకాంత్‌ని మర్చిపోయేలా చూస్తాను. నా మాట వినవూ ప్రభావతీ."

ప్రభావతి మాట్లాడలేదు. ఆమె వేళ్ళు గడ్డిని పీకటం మానేశాయి. ఏమీ చేయడానికి తోచక గాజులు సవరించుకుందామె.ఆమె సన్నని, ఎర్రని వేళ్ళు వణుకుతున్నాయి. గాలికి రెపరెపలాడే చివురుటాకుల్లా. కిందకి వాలి వున్న ఆమె కనురెప్పలు బరువుగా ఇంకా ఇంకా వాలిపోతున్నాయి.

"చెప్పు ప్రభావతీ! నిన్ను చూసిన క్షణాన్నే అనుకున్నాను.... ఏనాడో నన్ను వెర్రివాణ్ణి చేసి, నీ వేలి చుట్టూ చుట్టుకుంటావని."

ఆమె ఎర్రని పెదవులు మెల్లిగా చలించాయి. క్రమంగా ఆమె పెదవులు విచ్చుకుంటున్నాయి. సున్నితంగా, అందంగా చిరునవ్వు విరిసింది ఆమె పెదవుల పైన.

మధుసూదనరావు మనస్సులో నెమళ్ళు పురివిప్పి నాట్యమాడాయి. సహస్ర పద్మాలు ఒక్కమారు వికసించి ఫక్కున నవ్వాయి. శత శశాంకులు ఒక్కమాటు ఉదయించి దివ్యమైన వెన్నెల పండించారు మధుసూదనరావు మనస్సులో.

మరునాడుదయం సిగ్గుపడుతూ ఉదయించాడు సూర్యుడు. ప్రభావతి తన గదిలోంచి బైటకు వచ్చింది. మధుసూదనరావు కల్లోంచి మేలుకుని బైటికి వచ్చాడు. ఆమె గదికే వెళ్ళి కాఫీ తీసుకున్నాడతను. ఇద్దరూ కలిసి తోటకు వచ్చారు. మందారాలు, గులాబీలు వెర్రిగా పూసిన గుబుర్ల మధ్య బెంచి మీద కూర్చున్నారు.

"ప్రభావతీ! నీకొక సంగతి చెప్పాలి నేను" అన్నాడు మధుసూదనరావు.

"ఏమిటి?" అనడిగింది ప్రభావతి.

"నాకొక ప్రాణస్నేహితుడున్నాడు. కృష్ణమూర్తని. అతను గొప్ప గాయకుడు. చాలా బాగా పాడతాడు. ఈ ఊళ్ళోనే వుంటాడు. నిజంగా అద్భుతంగా పాడతాడనుకో. అతను, నేనెల్లాంటి అప్సరసని పెళ్ళిచేసుకుంటానో చూడాలనుంది అంటూండేవాడు. అతను వచ్చి ఈ సౌందర్యరాశిని చూసి ఏమంటాడో

వినాలనుంది నాకు. కానీ ఒకానొక కారణం వల్ల అతను మన పెళ్ళికి రావడానికి వీల్లేదు. అతను వస్తే రసాభాసం జరిగే పరిస్థితులున్నాయి."

ప్రభావతికేమీ అర్థం కాలేదు. "ఎందుకని? అంత ప్రాణస్నేహితుణ్ణి ఆహ్వానించకపోవడమేమిటి??" అనడిగిందామె. "ఇప్పుడు చెప్పను నీకే తెలుస్తుంది తర్వాత." అన్నాడు. ప్రభావతి ఊరుకుంది ఆట్టే ఆసక్తి లేనట్టు. కొద్దిసేపాగి మధుసూదనరావు అడిగాడు.





"ప్రభావతీ మీ నాన్నగారికి  రాయాలా మరి?"

"రాస్తాను. కానీ చూడండి...." ఆమె ముఖం ప్రక్కకు త్రిప్పుకుని మెల్లిగా నవ్వింది సిగ్గుపడుతూ.

"ఏమిటి ఇలా చూడు! ఏమిటది? ఏడుస్తున్నావా? చెప్పు" అన్నాడు మధుసూదనరావు. అతని కళ్ళు కూడా నవ్వుతున్నాయి. ఆశ్చర్యం బదులు అతని ముఖంలో ఆనందం కనిపిస్తోంది.

"ఏమిటి? చంద్రకాంత్ జ్ఞాపకం రాలేదు కదా! మళ్ళీ? మర్చిపోవాలి ప్రభావతీ మరి" అన్నాడు లాలనగా అతను. ప్రభావతి మాట్లాడలేదు. ఆమెకు ఇంకా ఇంకా నవ్వు వస్తోంది. బలవంతాన ఆమెని తన వేపు తిప్పాడతను. అతని కళ్ళల్లోకి చూడడానికే సిగ్గుపడుతూ చలిస్తున్నాయి ఆమె చూపులు. అతని బంగారు గుండీ  మీద దృష్టి నిల్పి నవ్వుతోందామె.

"నవ్వుతున్నావే? కొంపదీసి ఏడుస్తున్నావేమో నీ భగ్న ప్రేమని తలుచుకుని అనుకున్నాను."

"చూడండి! చంద్రకాంత్ లేడూ"

"లేడు" అన్నాడు మధుసూదనరావు గబుక్కున. ఆమె నొచ్చుకుంటుందేమో అన్న సందేహమైనా లేకుండా.

"అదే నేనిప్పుడు చెప్పబోతున్నాను. చంద్రకాంత్ అనే వ్యక్తి ఎవరూ లేరు."

మధుసూదనరావు పకపక నవ్వాడు. "నాకు తెలుసా సంగతి" అతనాశ్చర్య పోతాడనుకున్న ప్రభావతి తానే ఆశ్చర్యపోయింది.

"ఎల్లా తెలుసు?"

"ఎల్లా తెలుసునో నేను తర్వాత చెబుతాను. నీ కథ ఎల్లా అల్లావో ముందు నువ్వు చెప్పు" అన్నాడు మధుసూదనరావు. "ఏముంది, రెండు నెలల క్రితం నాస్నేహితురాలు ఒకామె వాదించింది. కష్టాల్లోవున్న స్త్రీ అంటే మొగవాళ్ళు ఇష్టపడతారని. ఇక్కడికి వచ్చాక మీతో పరిచయమైంది. మీరు అవివాహితులని, మీకు ఆస్థిపాస్తులు బాగా వున్నాయని నాకు తెలిసింది. ఎక్స్‌పెరిమెంట్ చేద్దామనుకున్నాను. మా ఇంటికి వుత్తరం వ్రాశాను. మిమ్మల్ని గురించి నాన్న ఆమోదించారు. నాకెల్లాగైనా వివాహమైతే చాలనుకున్న మా అమ్మ కూడా వప్పుకుంది.

ఈఊళ్ళో ఒక ఫోటో స్టూడియోకి వెళ్ళాను. నా కంటికి అందంగా కనుపించిన ఒక యువకుని ఫోటో కాపీ తీసుకుని చిన్న సైజుది నా లాకెట్లో వేయించి మరొకటి ఎన్‌లార్జి చేయించి పట్టుకొచ్చాను. మిగిలిన కథ అల్లి మీతో చెప్పాను. నా స్నేహితురాలు చెప్పింది నిజమేనని వప్పుకుంటూ వుత్తరం వ్రాశాను. ఇంక మీరెల్లా కనుక్కున్నారో చెప్పండి" అంటూ తన గాథ ముగించింది ప్రభావతి.

"ఏమీ లేదు. నువ్వా నాడు ఫోటో చూపించినప్పుడే తెలిసింది నాకు. నేను చెప్పిన గాయకుడు కృష్ణమూర్తి ఫోటో అది. కానీ మనిషిని పోలిన మనిషి వుంటాడని ఊరుకున్నాను. అతను క్రిందటి వారం నాకు కనిపించాడు. ఎవరో యువతి ఫోటో స్టూడియోకి వచ్చి,తన ఫొటో రెండు కాపీలు చాలా డబ్బు వెచ్చించి తీసుకువెళ్ళిందనీ, తనకిది చాలా ఆశ్చర్యంగా వుందనీ చెప్పాడు. నాకు వెంటనే అర్థమైంది. ఆ యువతి ఎవరో? కానీ నువ్వెందుకిల్లా చేస్తున్నావో నాకర్థం కాక తెలుసుకుందామని ఓపిక పట్టాను. కృష్ణమూర్తి గురించి ఇందుకే చెప్పాను నేను".

ఆశ్చర్యంగా కళ్లు పూర్తిగా తెరుచుకుని విన్నది ప్రభావతి "ఇదంతా నిజమేనంటారా? మీకీ ఊళ్లో ఎవరూ తెలియదు కదా అన్న ధీమాతో వున్నాను. నేను ఓడిపోలేదని మా స్నేహితురాలికి వ్రాస్తాను. నా దీన గాథ విని కాదు కదా మీరు నన్ను ప్రేమించింది. నా కథంతా అబద్ధమని తెలిసే కదా!"

"ఏమో! నీ కథ వినే ప్రేమించానేమో నిన్ను. ఇకనైనా ఆ లాకెట్‌లో ఫోటో తీసేయి. కృష్ణమూర్తికి ఇస్తాను. అది వుండవలసిన వారి దగ్గర వుంటుంది. ఇంతకీ ఆ స్థానంలో ఎవరి ఫోటో పెట్టాలి? నిన్ను పూవుల్లో పెట్టి పూజించే మరొక చంద్రకాంత్‌దా?"

"ఛీ పోండి" అంటూ సిగ్గుపడుతూ నవ్వింది ప్రభావతి.

**– ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక**